బ్రాహ్మణ విద్యార్థులకు నిలిచిన స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ) : తెలంగాణ బ్రాహ్మణ పరిషత్తు ఆధ్వర్యంలోని శ్రీ రామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, వేద విద్యార్థులకు ఉద్దేశించిన వేదహిత ఉపకార వేతనాల పథకం నిలిచిపోవడంతో పేద బ్రాహ్మణ విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్టు బ్రహ్మణ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. శ్రీరామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం కింద పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు 3.50 లక్షలు, వేదహిత విద్యార్థులకు మరో రూ.3 లక్షల మేర బకాయిపడ్డట్టు పేర్కొన్నాయి. వెంటనే బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశాయి.

సర్కారు బడులను బలోపేతం చేయండి : బీసీటీఏ

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడులను బలోపేతం చేయాలని, టీచర్ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వాన్ని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) కోరింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేసింది. మల్లు రవిని బీసీటీఏ ప్రతినిధి బృందం ఆదివారం ఘనం గా సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు.

రేవంత్ ఇంటివద్ద టీచర్ల పడిగాపులు

అయినా దొరకని అపాయింట్‌మెంట్ • సీఎం పీఏకి వినతిపత్రం ఇచ్చిన టీచర్లు

హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): 'మాది ప్రజాప్రభుత్వం. ప్రజలు ఎప్పుడొచ్చినా మా తలుపులు తెరిచే ఉంటాయి'.. సీఎం రేవంత్‌రెడ్డి తరుచూ చెప్పే మాటలివి. ఆచరణలో మాత్రం ఇవి అటకెక్కేశాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా సీఎం దర్శనం దుర్లభంగా మారింది. రేవంత్ ఇంటి వద్ద టీచర్లు పడిగాపులు కాసినా వృథా ప్రయాసే అయింది. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్జీటీయూ) చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. పలు జిల్లాలకు చెందిన ఎస్జీటీలు ఉదయాన్నే సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి తరలివచ్చారు. పెద్దమ్మగుడి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సమావేశమయ్యారు. పోలీసుల ఆంక్షల కారణంగా వారికి సీఎంను కలిసే అవకాశం లభించలేదు. సీఎంను కలిశాకే తాము వెనుదిరుగుతామని భీష్మించడంతో చివరికి ఐదుగురు ప్రతినిధులను ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సీఎం నివాసంలోకి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి పిలిచారు కాబట్టి తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన వారికి అక్కడికెళ్లాక మరోమారు నిరాశే ఎదురైంది. చాలాసేపు వేచి చూసిన తర్వాత సీఎం బిజీగా ఉన్నారని, ప్రస్తుతం కలవడం సాధ్యం కాదని చెప్పడంతో చేసేది లేక రేవంత్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చి వెనుదిరగాల్సి వచ్చింది.

> **10 వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి**
>
> రాష్ట్రంలో 60వేల మంది సెకండరీ గ్రేడ్ టీచర్లున్నారు. 29 ఏండ్ల నుంచి ఎస్జీటీలుగా పనిచేస్తున్నా పదోన్నతులు లేవు. 1 నుంచి 5 తరగతులకు బోధించేందుకు సరిపడా టీచర్లను నియమించాలి. గత ప్రభుత్వం 10 వేల ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయ (పీఎస్ హెచ్ఎం) పోస్టులు ప్రకటించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పోస్టులను మంజూరు చేస్తూ బీఎడ్, డీఎడ్ అర్హత గల వారికి కామన్ సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలి. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టుల్లోనూ కామన్ సీనియార్టీ ఇవ్వాలి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించాలి. ఎస్జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి. స్కూళ్లల్లో పారిశుధ్య నిర్వహణకు సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలి.
>
> **- కరివేద మహిపాల్‌రెడ్డి, ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు**

నల్లగొండ శివారులో మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకొని నిరసన తెలుపుతున్న బాధితులు

మంత్రి కోమటిరెడ్డి ఘెరావ్

- నల్లగొండ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని బాధితుల నిరసన
- కాళ్ల మీద పడ్డా కనికరం చూపలేదని ఆవేదన
- సీఎం రేవంత్ వచ్చినా చేసేదేమీ లేదని జారుకున్న మంత్రి కోమటిరెడ్డి

నీలగిరి, జూన్ 16: రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులు ఆదివారం నల్లగొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఘెరావ్ చేశారు. తమకు న్యాయం చేసే వరకు కదలనిచ్చేది లేదని రోడ్డుపై బైఠాయించారు. కొందరు మహిళలు కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. తాను చేసేదేమీ లేదని, సీఎం రేవంత్ వచ్చినా ఇదే పరిస్థితి అంటూ మంత్రి పోలీసుల సాయంతో అక్కడి నుంచి జారుకున్నారు. నల్లగొండ పట్టణం మీదుగా కేంద్ర ప్రభుత్వం 565 నంబర్ జాతీయ రహదారిని నిర్మిస్తున్నది. నల్లగొండ పట్టణం నుంచి కాకుండా శివారు నుంచి రోడ్డు వేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి దానికి 3 ప్రతిపాదనలు చేశారు.

పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లిలో ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

నీళ్లకోసం రోడ్డెక్కిన మహిళలు

బిట్టుపల్లిలో ఖాళీ బిందెలతో ఆందోళన

మంథని రూరల్, జూన్ 16: వానకాలంలోనూ ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లిలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో తాజా మాజీ సర్పంచ్ పోగుల సదానందం ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. తాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఏనాడు నీళ్లకోసం ఇక్కట్లు పడలేదని అన్నారు. వెంటనే స్పందించిన తాజా మాజీ సర్పంచ్ సదానందం సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా.. నీటి సమస్య తీరేదాకా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

సాధారణ బదిలీలు చేపట్టండి

- నాలుగు పెండింగ్ డీఏలను చెల్లించాలి
- ఐఆర్‌ను 20శాతానికి పెంచాలి
- సీపీఎస్‌ను రద్దుచేయాలి
- ప్రభుత్వానికి టీజీవో రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

సమావేశంలో మాటాడ్లుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి. చిత్రంలో సంఘం నేతలు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : దశాబ్దకాలంగా నోచుకోని ఉద్యోగుల సాధారణ బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన వారిని తిరిగి వెనక్కి రప్పించాలని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన టీజీవో కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధానకార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉద్యోగుల సమాన వాటాతో ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని, ట్రస్టులో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం పెంచాలని, ప్రస్తుతం ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు కాలాన్ని పొడిగించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులను చెల్లించాలని, రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన 144 మంది ఉద్యోగులను వెనక్కి రప్పించేందుకు ప్రభుత్వం ఆమోదించిన ఫైల్‌ను అమలుపరచాలని విజ్ఞప్తి చేశారు. జీవో -317 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొన్న అన్ని రకాల ఫిర్యాదులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఐఆర్‌ను 5 నుంచి 20శాతానికి పెంచాలని కోరారు. వైద్యారోగ్యశాఖకు సంబంధించిన జీవో 142ను పునః సమీక్షించాలని, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో గత జిల్లాల ప్రకారం అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉన్నతాధికారులకు ఒక నెల వేతనంతోపాటు, పెండింగ్‌లోని రెమ్యునరేషన్‌ను చెల్లించాలని కోరారు. జిల్లా, మండలస్థాయి అధికారుల పట్ల అవమానకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్న కొంత మంది జిల్లా కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని, అద్దె వాహనాల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు బీ శ్యామ్, ఉపాధ్యక్షుడు ఏ జగన్‌మోహన్‌రావు, కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, మహిళా ప్రతినిధి జీ దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్ రామకృష్ణాగౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల వద్ద పట్టాదారు పాస్ పుస్తకాలను చూపుతున్న రైతులు

వేరేచోట భూములివ్వండి

- మార్కెట్ రేటు ప్రకారం చెల్లించండి
- 'చిన్న కాళేశ్వరం' పనులను అడ్డుకున్న రైతులు

మహదేవపూర్, జూన్ 16: ప్రాజెక్టు పేరుతో తమ భూములను లాక్కున్నారని, అందుకుగానూ తమకు వేరేచోట భూములైనా ఇవ్వాలి లేదా మార్కెట్ రేటు ప్రకారం పరిహారమైనా చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో ఎర్రచెరువు వద్ద చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేస్తూ జీవిస్తున్నామని, వాటికి పట్టాలు సైతం ఉన్నాయని చెప్పారు. తమ భూములను లాక్కొని తమకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా ఎర్రచెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో 25 మంది రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల సాగుభూమి పోతుందని వాపోయారు. అన్నంపెట్టే భూములను స్వాధీనం చేసుకోవడం దారుణమని మండిపడ్డారు. మంత్రి శ్రీధర్‌బాబుకు మూ డుసార్లు తమ గోడును వెల్లబోసుకున్నా ఫ లితం లేదని చెప్పారు. బాధిత రైతులకు మరో చోట భూమి ఇప్పించాలని, లేదా మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించి పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు జనగామ సరోజన, జనగామ సమ్మక్క, చిలుముల సమ్మక్క, చిలుముల లక్ష్మి, బొడ్డెయ్య, రుద్రమ్మ, రామచంద్రం, చిలుముల రాజేశం, రాజయ్య, తలారి శ్రీనివాస్, రామటెంకి మహేందర్, ఖదీర్ పాల్గొన్నారు.

రాబడి

ఇలా ట్రై చేయండి

ఆర్థిక స్థిరత్వానికి ఆరు సూత్రాల విధానం

ప్రశాంతమైన జీవనాన్ని ఎవరు కోరుకోరు చెప్పండి. మీ ఆర్థిక స్థితి ఇందుకు ఎంతగానో దోహదపడుతుంది. అందుకు తెలివైన నిర్ణయాలతో, చక్కని ఆర్థిక ప్రణాళికతో మీ సంపదను పెంచుకుంటూపోవాల్సి ఉంటుంది. అప్పుడే మీ సంపాదనకు విలువ, మీకు గౌరవం లభిస్తాయి. ప్రధానంగా ఆర్థిక లక్ష్యాల సాధనకు క్రమశిక్షణ చాలా అవసరం. దానికి ఈ 6 సూత్రాలతో ప్రయత్నించండి.

బడ్జెట్-పాదుపు

నగదును ఆదా చేయాలన్నా, అప్పులను తప్పించుకోవాలన్నా.. మీ ఖర్చులపై కన్నేస్తేనే సాధ్యం. అందుకే మీరు మీకోసం ఓ నెలవారీ బడ్జెట్‌ను ఏర్పర్చుకోవాలి. అవసరమైనంత మేరకే ఖర్చులు పెట్టండి. ఖర్చు చేసే ముందు ఇది మనకెంత వరకు ఉపయోగకరం అని ఆలోచించండి. ఈ క్రమంలోనే నెలనెలా చెల్లింపులు, అవసరాలు, కోరికలు, ఆదాలను గమనిస్తూ ముందుకెళ్లండి. ప్రతినెలా మీరు పెట్టే ఖర్చు ఏదైనా ఓ పుస్తకంలో రాసుకోండి. ఆ తర్వాత ముందటి నెలతో పోల్చి చూడండి. దేనికి అనవసరంగా ఖర్చు చేస్తున్నామో మీకే తెలిసిపోతుంది. ఈ క్రమంలోనే ప్రతినెలా ఉంటున్న ఖర్చులపై ఓ అంచనాకు వచ్చి చక్కని బడ్జెట్ రూపొందించుకోండి. ఇక ఆండ్రాయిడ్, ఐవోఎస్ మొబైల్ యూజర్ల కోసం ఎన్నో ఉచిత బడ్జెట్ ప్లానింగ్ యాప్‌లూ అందుబాటులో ఉన్నాయి. వాటిని ఒకసారి ట్రై చేసి చూడండి.

లక్ష్యం

లక్ష్యాన్ని ఎంచుకొని కదిలితే ఉత్సాహంగా ముందుకెళ్లవచ్చు. అదిలేని ప్రయాణం గమ్యాన్ని చేరదు. అందుకే ప్రతీదానికీ ఓ టార్గెట్ అనేది ఉండాలి. ఆర్థికపరమైన అంశాలకూ ఇదే వర్తిస్తుంది. మనం ఎంచుకొనే లక్ష్యమే మనకో మార్గాన్ని ఏర్పర్చగలదు. సంపాదన, పొదుపు అన్నీ దానిపైనే ఆధారపడి ఉంటాయి. సొంతిల్లు, రిటైర్మెంట్ ఫండ్, పిల్లల ఉన్నత చదువులు, పెండ్లిళ్లు ఇలా అన్నికలలు నేరవేరగలవు.

పెట్టుబడి

జీవితంలో ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే పొదుపు ఒక్కటే సరిపోదు. పెట్టుబడులూ ముఖ్యమే. మీ సంపద వృద్ధికి కావాల్సినంత మేర నగదును ఇన్వెస్ట్ చేయండి. అందుకోసం ఉన్న అవకాశాలను పరిశీలించండి. వివిధ పెట్టుబడి సాధనాల గురించి తెలుసుకోండి. అలాగే అందులో ఉన్న రిస్క్‌పైనా ఓ అంచనాకు రావడం మంచిది. నెలనెలా పెట్టుబడులు పెట్టే పథకాలుంటాయి. మన ఆదాయ, వ్యయాలకు తగ్గట్టుగా ఎంచుకుని ముందుకెళ్తే ఆశించిన ప్రతిఫలాలను అందుకోగలం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, సిప్‌లు, గోల్డ్ బాండ్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలు అనుకూలం. రియల్ ఎస్టేట్ ద్వారా భూములను కొనుగోలు చేయవచ్చు. డాక్యుమెంట్లు, అనుమతులను జాగ్రత్తగా చూసి నిర్ణయం తీసుకోవాలి.

అత్యవసర నిధి

ఎప్పుడు, ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఎవరికీ తెలియదు. అందుకే అత్యవసర నిధి తప్పక ఉండాలి. మీకు ఎలాంటి ఆదాయం లేకపోయినా.. కనీసం 6 నెలలపాటు ఏ ఇబ్బందీ లేకుండా జీవించేంత నగదు నిల్వలతో ఈ నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం వ్యాపార, ఉద్యోగ రంగాల్లో ఎన్ని ఒడుదొడుకులుంటున్నాయో చూస్తూనే ఉన్నాం. మార్కెట్ మందగమనంలో ఉన్నది. కంపెనీలు సైతం వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగ కోతలకు దిగుతున్నాయి. కాబట్టి ఆదాయం ఉన్నప్పుడే కొంత నగదును తీసి అత్యవసర నిధిని పోగేయాలి. తద్వారా ఈఎంఐలు, కిరాణా, ఔషధ, ఇతర ఇంటి ఖర్చుల కోసం ఇతరుల వద్ద చేయిచాచే దుస్థితి రాదు. ఇక ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు అప్పులిచ్చిన బ్యాంకులకు, ఇతర సంస్థలకు ఆ విషయాన్ని ముందుగానే తెలియజేయండి. అప్పుడు కొంత వెసులుబాటును పొందే అవకాశం ఉంటుంది.

రుణ భారం

ప్రతి ఒక్కరికీ రుణాల అవసరం ఉంటుంది. అయితే ఆ రుణాలు మితిమీరితే అప్పుల ఊబిలో కూరుకుపోతాం. కాబట్టి మోయలేనంత రుణ భారం ఎప్పుడూ ఉండకూడదు. అనవసరమైన వాటి జోలికెళ్తే అప్పుల తిప్పలే ఉంటాయి. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల విషయంలో చాలాచాలా జాగ్రత్తగా ఉండాలి. పర్సనల్ లోన్లపై వడ్డీభారం ఎక్కువగా ఉంటుంది. అత్యవసరమైతే తప్ప దానికి వెళ్లకపోవడమే శ్రేయస్కరం. ఇక ఆన్‌లైన్ యాప్ లోన్లు ఎంత ప్రమాదకరంగా ఉంటున్నాయో చెప్పనక్కర్లేదు. మరీ అంత అవసరమైతే గోల్డ్ లోన్లను ట్రై చేయవచ్చు. వడ్డీ కూడా తక్కువే. వెంటనే నగదు చేతికొస్తుంది.



బీమా అనేది అన్నిటికన్నా ముఖ్యం. జీవిత, ఆరోగ్య, వాహన, గృహ, వస్తు ఇలా ఏదైనాసరే దానికి బీమా అనేది తప్పనిసరి. నిజానికి కరోనా సమయంలో ఆరోగ్య బీమా ప్రాధాన్యత అందరికీ తెలిసొచ్చింది. అయితే బీమా అంటే మొక్కుబడిగా కాకుండా.. సమగ్రమైన రీతిలో ఉండాలి. అప్పుడే అది ప్రయోజనకరంగా, మనకు, మనవాళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇక బీమాను సేవింగ్స్‌లా చూడవద్దు. జీవిత బీమా అయినా, ఆరోగ్య బీమా అయినా.. ఏదైనాసరే గరిష్ఠ స్థాయిలో ఉండేలా చూసుకోండి. మనం లేనప్పుడు మనపై ఆధారపడేవారికి దన్నుగా నిలిచేదే జీవిత బీమా. కాబట్టి టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లను ఎంచుకుంటే ఉత్తమం. ఇక మనకున్న అన్ని ఆరోగ్య సమస్యలకు చికిత్స లభించేలా హెల్త్ ఇన్సూరెన్స్ ఉండాలి. మోటర్ ఇన్సూరెన్స్‌లో థర్డ్ పార్టీ బీమాను అశ్రద్ధ చేయవద్దు. హోమ్ లోన్ తీసుకున్నప్పుడు.. దానిపై ఇన్సూరెన్స్‌నూ తీసుకోండి. దురదృష్టవశాత్తూ మీకేదైనా అయితే బీమాతో ఇల్లైనా మిగులుతుంది. ఖరీదైన వస్తువులను కొన్నప్పుడు వాటికీ బీమా చేయించుకోవచ్చు.

డిజిటల్ గోల్డ్‌తో లాభాలివే

డిజిటల్ గోల్డ్.. గత 2-3 ఏండ్లుగా ఎక్కువగా వినిపిస్తున్న పదం. డిజిటల్ గోల్డ్ అంటే.. బంగారానికి ఎలక్ట్రానిక్ రూపం. డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ వేదికల ద్వారా పసిడి నిల్వ, క్రయవిక్రయాలు జరుగుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే భౌతిక బంగారాన్ని మనం చూడవచ్చు, తాకవచ్చు, ఆభరణాలుగా మార్చి ధరించవచ్చు. కానీ డిజిటల్ గోల్డ్‌కు ఆ అవకాశాలేవీ ఉండవు. దాని విలువ మాత్రమే కనిపిస్తుంది.

నిరంతర పెట్టుబడులు

డిజిటల్ గోల్డ్ వేదికలు.. ఆన్‌లైన్‌లో బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు, దాన్ని అమ్మేందుకు, కొనేందుకు నిరంతర సేవల్ని అందిస్తున్నాయి.

చౌక

చిన్నచిన్న మొత్తాల్లోనూ డిజిటల్ గోల్డ్‌ను కొనవచ్చు. రిటైల్ మదుపరులకు కలిసొచ్చే అంశం.

భద్రత

ప్రధాన డిజిటల్ గోల్డ్ వేదికలు.. మదుపరులు కొన్న బంగారాన్ని భద్రంగా నిల్వ చేస్తున్నాయి. భౌతిక బంగారానికున్న దొంగతనం బెడద దీనికుండదు.

సులభంగా నగదు

డిజిటల్ గోల్డ్‌ను అవసరమనుకున్నప్పుడు సులభంగానే నగదుగా మార్చుకోవచ్చు. తరుగు వంటివి ఉండవు కాబట్టి సాధారణ పసిడితో పోల్చితే మదుపరులకు రీ-సేల్‌లో అత్యధిక స్థాయిలో నగదునూ పొందవచ్చు.

పారదర్శకంగా ధరలు

ధరల్లో పారదర్శకత ఉంటుంది. ప్రధాన డిజిటల్ గోల్డ్ వర్తకులు మార్కెట్ ధరల ఆధారంగా ఈ క్రయవిక్రయాలు జరుపుతారు.

పన్ను ఆదాపై ఓ లుక్కేద్దాం

చాలామంది మదుపరులకు పన్ను ఆదానే ప్రధానం. అయితే అందుకున్న అవకాశాలేంటన్నదానిపై కొందరికే అవగాహన ఉంటున్నది. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అలాంటి పెట్టుబడులను ఒక్కసారి చూద్దాం.

సాధనం	లాకిన్ పీరియడ్
ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం	3 ఏండ్లు
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్	15 ఏండ్లు
యూనిట్ లింక్డ్ బీమా ప్లాన్లు	5 ఏండ్లు
సుకన్య సమృద్ధి యోజన	21 ఏండ్లు
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం	5 ఏండ్లు
నేషనల్ పెన్షన్ స్కీం	60 ఏండ్లు దాటాలి
జీవిత బీమా	స్కీం ఆధారంగా
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్	5 లేదా 10 ఏండ్లు
ఫిక్స్‌డ్ డిపాజిట్లు	5 ఏండ్లు

- వీటిపై ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, 80సీసీడీ(1), (1బీ) కింద గరిష్ఠంగా రూ.1.5 లక్షల దాకా పన్ను మినహాయింపులుంటాయి.
- బీమా పాలసీలకు సంస్థలు నిర్ణయించిన ఫిక్స్‌డ్ వడ్డీరేటు ఆధారంగా రాబడులుంటాయి. వీటి ప్రీమియంపై పన్ను రాయితీ లభిస్తుంది.
- ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంస్థలు, బ్యాంకులు నిర్ణయించిన ఫిక్స్‌డ్ వడ్డీరేట్ల ఆధారంగా ఆదాయం ఉంటుంది. మీరు చేసే ఎఫ్‌డీ మొత్తాలపై పన్ను ప్రోత్సాహకం అందుతుంది.
- కేంద్ర ప్రభుత్వ పథకాల్లో కేంద్రం నిర్ణయించిన ఫిక్స్‌డ్ వడ్డీరేట్ల ప్రకారం ఆదాయాలుంటాయి. మీ పెట్టుబడుల ఆధారంగా ట్యాక్స్ ప్రయోజనాలు వర్తిస్తాయి.
- ఈఎల్ఎస్ఎస్‌లో పెట్టుబడులు మార్కెట్‌పై ఆధారపడి ఆదాయాన్ని అందిస్తాయి.



పడుతూ.. లేస్తూ.. పయనం

మార్కెట్ పల్స్

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకులకు లోనైనా లాభాలనే అందుకున్నాయి. మదుపరులు అంతకుముందు వారంలాగే అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. అయితే చివరకు పెట్టుబడులకే మొగ్గారు. దీంతో సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 299.41 పాయింట్లు పెరిగి 76,992.77 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 175.45 పాయింట్లు అందిపుచ్చుకుని 23,465.60 దగ్గర నిలిచింది. ఈ వారం సైతం సూచీలు ఓవరాల్‌గా లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. లాభనష్టాల మధ్య కొట్టుమిట్టాడినా.. చివరకు ఓ మోస్తరు వృద్ధినే చూస్తాయన్న అభిప్రాయాలు మెజారిటీ నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సూచీలు జీవనకాల గరిష్ఠాల వద్దనుండటంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగే అవకాశాలూ ఉన్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,600-23,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.